సాక్షి
సూర్యాపేట
శుక్రవారం : 27 : జనవరి : 2023



కలిసికట్టుగా జోడో యాత్ర
కలిసికట్టుగా జోడో అభియాన్ యాత్ర చేపడతామని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ తెలిపారు. - 8లో



రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు
నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగుట్టులో బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. - 10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32.°/18°
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

దురాజ్‌పల్లి (సూర్యాపేట): తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్, కార్మిక, ఉపాధి శిక్షణ, పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో స్పెసిఫైడ్ స్కిల్డ్ కింద జపాన్ దేశంలో పనిచేసేందుకు అర్హత కలిగిన నర్సింగ్ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి సామ మాధవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు పొందిన కళాశాలల నుంచి నర్సింగ్ గ్రాడ్యుయేషన్, జీఎన్ఎం డిప్లొమా పూర్తి చేసి 22 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 28న జిల్లాకేంద్రంలోని శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.1.20 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు వేతనంతో ఉద్యోగ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 99519 09863, 832860223 నంబర్లను, www.tomcom.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న ఏపూరి సోమన్న

తిరుమలగిరి: తిరుమలగిరి మండలంలో దళితబంధు పథకంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కమీషన్లు దండుకున్నారని, ఈ పథకంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి లబ్ధిదారులకు న్యాయం చేయాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తిరుమలగిరిలో విలేకరులతో మాట్లాడారు. దళితబంధు పథకంలో మండలంలోని ఒక్కొక్క గ్రామంలో రూ.కోటి నుంచి రూ.రెండు కోట్లు చేతులు మారాయని ఆరోపించారు. దళితబంధు పథకంలో అక్రమాలు నిరూపించకపోతే స్థానిక తెలంగాణ చౌరాస్తాలో ముక్కును నేలకు రాస్తానని సవాల్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పేరాల యాదగిరి, సీహెచ్ పరమేష్, నాగన్న, రాములు, చంద్రశేఖర్, జి.సురేందర్, రాము, శంబయ్య, నర్సయ్య, సైదులు, మక్బుల్, మల్లేష్, వెంకన్న రాము తదితరులు పాల్గొన్నారు.


తప్పుడు కేసులకు బెదిరేది లేదు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న పిల్లుట్ల శ్రీనివాస్, ఇతర నాయకులు

కోదాడ: తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అధికార పార్టీ ఎమ్మెల్యే తప్పుడు కేసులు బనాయిస్తే తాము బెదిరిపోమని, దానికి ఆయన తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి పిల్లుట్ల శ్రీనివాస్ అన్నారు. కోదాడ మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్ వద్ద కోదాడ ఎమ్మెల్యే మాట్లాడిన వ్యాఖ్యలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టారని రెండు రోజుల క్రితం శ్రీనివాస్‌ను అనంతగిరి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు. గురువారం ఆయన బెయిల్‌పై విడుదలైన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే అన్న మాటలను సామాజిక మాధ్యమాల్లో పెట్టడం ఎలా నేరం అవుతుందో పోలీస్ అధికారులు చెప్పాలన్నారు. కోదాడ నియోజకవర్గంలో దందాలు చేస్తున్నది ఎవరో అందరికీ తెలుసని పోలీస్ అధికారులు చేతనైతే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బెయిల్‌పై విడుదలైన శ్రీనివాస్‌కు టీడీపీ నాయకులు ఆయన ఇంటికి వెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు దండోలు తిరుపతయ్య, కందుకూరి ఉపేందర్, టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి దుర్గాప్రసాద్, నాయకులు సామినేని నరేష్, ఉప్పగండ్ల శ్రీనివాస్, ముత్తినేని సైదేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎంగా శ్రీదేవి



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీదేవి

నల్లగొండ రూరల్: ఉమ్మడి జిల్లా ఆర్టీసీ ఆర్‌ఎంగా శ్రీదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన వరప్రసాద్ హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న శ్రీదేవి నల్లగొండ ఆర్‌ఎంగా బాధ్యతలు చేపట్టారు. ప్రయాణికులు, ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

సమగ్రాభివృద్ధికి కృషి

- వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం
- మెరుగుపడిన విద్య, వైద్యరంగాలు
- 74వ గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



కలెక్టరేట్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు

సూర్యాపేట/దురాజ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలననుసరించి జిల్లా సమగ్రాభివృద్ధికి అధికార యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ అన్నారు. 74వ గణతంత్ర వేడుకల్లో భాగంగా గురువారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ జిల్లాలో ప్రధానమైనది వ్యవసాయమని జిల్లా వ్యాప్తంగా 5లక్షల 85వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయని, ఇందుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. సాగుకు ఇబ్బందులు లేకుండా ప్రతి రైతుకూ ఎకరాకు రూ.5వేల చొప్పున రెండు విడతల్లో రూ.10వేలు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. రైతుబంధు పథకం ద్వారా జిల్లాలో 2లక్షల 67వేల మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది కలగకుండా వారి నుంచి గత యాసంగి సీజన్‌లో 2లక్షల 15వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి రూ.421కోట్లు చెల్లించామన్నారు. ఉద్యానవన శాఖ ద్వారా 4,400 హెక్టార్లకు డ్రిప్ సౌకర్యం కల్పించామని, 621 హెక్టార్లలో ఆయిల్‌పామ్ తోటలు సాగు అయ్యేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. వ్యవసాయ అనుబంధమైన మత్స్యశాఖ ద్వారా జిల్లాలోని 578 చెరువుల్లో 2కోట్ల 44లక్షల చేప పిల్లలను 25 చెరువుల్లో 28లక్షల నీటి రొయ్యలను వదలడం జరిగిందన్నారు. పశుసంవర్థక శాఖ ద్వారా సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు, గడ్డికత్తిరించే యంత్రాలు అందించామని తెల్లజాతి పశువులకు వస్తున్న లంపిస్కిన్ వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయగలిగామని పేర్కొన్నారు. రూ.66కోట్లతో మూసీ ఆధునీకరణ పనులు చేపట్టి ఇప్పటికే రూ.38కోట్ల విలువగల పనులను పూర్తి చేశామన్నారు. రూ.1,183 కోట్లతో ముక్త్యాల్ బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ స్కీం పనులు వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు నీటి సమస్య లేకుండా 42 చెక్ డ్యామ్‌లు మంజూరు కాగా ఇప్పటికే సగం మేరకు పూర్తి చేయించామని తెలిపారు.

సంక్షేమానికి బాటలు..

అభివృద్ధే కాకుండా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో 18వేల 500 సమభావన సంఘాలకు వివిధ బ్యాంకుల ద్వారా రూ.492కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందించామని శ్రీనిధి ద్వారా మరో రూ.24,500 కోట్లు మంజూరు చేశామన్నారు. ఆసరా పెన్షన్ పథకం ద్వారా లక్షా 51వేల మందికి ప్రతినెలా రూ.35.40 కోట్లు ప్రభుత్వం విడుదల చేస్తుందని, వీటిని లబ్ధిదారులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

విద్య, వైద్యరంగాల అభివృద్ధికి..

జిల్లాలో విద్య, వైద్య రంగాల మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 28 కేజీబీవీలకు సమగ్రశిక్ష అభియాన్ పథకం కింద మంజూరైన రూ.5.89 కోట్లతో వివిధ పనులు చేపట్టామని, మన ఊరు–మన బడి కింద 329 పాఠశాలలకు మొదటి విడతలో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. విదేశీ విద్యా పథకం ద్వారా 9 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.కోటి 5 లక్షలు, 4గురు ఎస్టీ విద్యార్థులకు రూ.80 లక్షలు, ఒక మైనార్టీ విద్యార్థికి రూ.20లక్షల 60వేలు అందించామన్నారు. అదేవిధంగా గురుకుల పాఠశాలలు, కస్తూరిబా బాలికల విద్యాలయాల ద్వారా మెరుగైన విద్యను పేద విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైద్యారోగ్య శాఖ ద్వారా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లాలో 50 కేంద్రాల్లో కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 22 పీహెచ్‌సీలు 82 పల్లె దవాఖానాలు, 4 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 161 ఆరోగ్య ఉప కేంద్రాలు, 1 జనరల్ ఆసుపత్రి, 1 ఏరియాస్పత్రి, 3 సీహెచ్‌సీల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. రూ.488 కోట్ల వ్యయంతో జిల్లా కేంద్రంలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల త్వరలో ప్రారంభానికి సిద్ధం చేశామన్నారు. జిల్లాలో గర్భిణులకు నార్మల్ డెలివరీపై అవగాహన కల్పిస్తున్నామని, ఇప్పటికే 80శాతం నార్మల్ డెలివరీలు చేయించి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపామని పేర్కొన్నారు.

షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతికి..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న దళిత బంధు పథకం జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయబడ్డ తిరుమలగిరి మండలంలో 2,223 ఎస్సీ కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున అందించామని, అదే విధంగా నాలుగు నియోజకవర్గాలలో 345 మంది దళిత కుటుంబాలకు రూ.34.50 కోట్లు అందించి వివిధ యూనిట్లను ఏర్పాటు చేయించామని పేర్కొన్నారు.

పారదర్శకంగా పోలీస్ సేవలు

స్నేహ పూర్వక పోలీస్ విధానాన్ని అవలంబిస్తూ జిల్లాలో పోలీస్ యంత్రాంగం పనిచేస్తుందని, నిత్యం ఫిర్యాదుదారులకు అందుబాటులో ఉంటూ బాధితుల సమస్యలపై త్వరగా స్పందించి వేగంగా, పారదర్శకంగా పోలీస్ వ్యవస్థ సేవలందిస్తుందన్నారు. అంతే కాకుండా నూతనంగా పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న 250 మంది విద్యార్థులకు ఉచితంగా శిక్షణను అందిస్తున్నామన్నారు. గంజాయి రవాణా అరికట్టామని, షీ టీమ్‌లతో నిరంతరం నిఘా ఏర్పాటు చేసి, రాత్రి వేళల్లో బందోబస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పట్టణాలకు దీటుగా పల్లెల్లో ప్రగతి

దేశం అభివృద్ధి చెందాలంటే ముందుగా గ్రామాలు అభివృద్ధి బాట పట్టాలనే ఉద్దేశంతో పల్లెలను పట్టణాలకు దీటుగా నిలపాలని పల్లె ప్రగతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీల్లో రూ.376 కోట్లతో పల్లె ప్రగతి పనులు చేపట్టామని, గ్రామాల పరిశుభ్రతకు తగిన చర్యలు తీసుకుంటున్నామని, ట్రాక్టర్ల కొనుగోలు, డోర్ టు డోర్ చెత్త సేకరణ, సెగ్రిగేషన్ షెడ్ల ఏర్పాటు, కంపోస్టు ఎరువుల తయారీ, వైకుంఠ ధామాలు పల్లెల రూపురేఖలను మార్చాయన్నారు.

> 'జిల్లాలో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యమిస్తూనే విద్య, వైద్య రంగాలను మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నాం. పట్టణాలకు దీటుగా పల్లెలు అభివృద్ధి చెందేలా ప్రణాళికలు సిద్ధం చేసి తగిన చర్యలు తీసుకుంటున్నాం. అభివృద్ధిలో జిల్లాను అగ్రగామిగా నిలుపుతాం.'
> – జిల్లా కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్





జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు



స్వాతంత్య్ర సమరయోధులను సన్మానిస్తున్న కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్



కలెక్టరేట్‌లో పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఉత్తమ సేవలకు ప్రశంసలు
- వివరాలు 8లో

వరి సాగులో నంబర్ వన్

- ధాన్యం ఉత్పత్తి, ఉపాధి హామీ పనుల కల్పనలోనూ జిల్లా టాప్
- జనాభాలో 50 శాతం మంది కూలీలు
- అక్షరాస్యత 64 శాతంగా నమోదు
- తెలంగాణ స్టాటిస్టికల్ రిపోర్టులో వెల్లడి



దురాజ్‌పల్లి (సూర్యాపేట): వరి సాగులో రాష్ట్రంలోనే సూర్యాపేట జిల్లా మొదటి స్థానంలో నిలించింది. జిల్లాలో 84శాతం మంది గ్రామీణ జనాభా, 16 శాతం పట్టణ జనాభా ఉంది. జిల్లాలో 64 శాతం అక్షరాస్యత నమోదై ఉంది. ఉపాధి హామీ పనుల కల్పనలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన తెలంగాణ స్టాటిస్టికల్ రిపోర్ట్–2021–22లో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

వరి సాగు.. ధాన్యం ఉత్పత్తిలో ఇలా..

ప్రభుత్వ విడుదల చేసిన స్టాటిస్టికల్ రిపోర్ట్ ప్రకారం 2021–22 యాసంగిలో జిల్లాలో రాష్ట్ర వ్యాప్తంగా 35.64 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా జిల్లాలో అత్యధికంగా 4,37,958 ఎకరాల్లో సాగు చేశారు. దీంతో 8,62,416 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగి రాష్ట్రంలోనే ఇటు సాగుతో పాటు ఉత్పత్తిలోనూ ప్రథమ స్థానంలో నిలిచింది. ఇతర పంటల్లో జిల్లా రాష్ట్రంలో చివరి నుంచి రెండవ స్థానంలో ఉంది.

జిల్లా జనాభా 10.99లక్షలు

జిల్లాలో 10,99,560 మంది జనాభా ఉండగా 9,28,521 మంది గ్రామీణ జనాభా, 1,71,039 పట్టణ జనాభా ఉన్నట్లు నమోదైనది. 84.4 శాతం గ్రామీణ జనాభా ఉండగా, 15.6 శాతం పట్టణ జనాభా ఉన్నారు. మొత్తం జనాభాలో 0–6 సంవత్సరాల వయస్సుల పిల్లలు 1,10,136 మంది ఉండగా రాష్ట్ర జనాభాలో జిల్లా జనాభా 21వ స్థానంలో ఉంది. జిల్లాలో 6,34,313 మంది అక్షరాస్యులు ఉండగా అక్షరాస్యత శాతం 64 శాతంగా నమోదైనది. అక్షరాస్యతలో మొదటి రెండు స్థానాల్లో జోగులాంబ, నారాయణపేట జిల్లాలు ఉండగా జిల్లా 21వ స్థానంలో ఉంది. ఇక పురుషుల అక్షరాస్యత 73 శాతం ఉండగా స్త్రీల అక్షరాస్యత 54శాతం మాత్రమే నమోదైనది. జిల్లాలో వెయ్యి మంది పురుషులకు స్త్రీల నిష్పత్తి 996గా ఉంది.

50 శాతం కూలీలే..

జిల్లా జనాభాలో 50 శాతంకుపైగా కూలీలే ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 5,61,528 మంది కూలీలు ఉండగా వీరిలో 4,95,764 ప్రధాన కూలీలు కాగా 98,773 వ్యవసాయ కూలీలు ఉన్నారు.

ఉపాధి పనుల్లో మొదటి స్థానం

జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకంలో నమోదైన కూలీలకు 47 శాతం మందికి పని కల్పించి జిల్లా మొదటి స్థానంలో నిలించింది. జిల్లాలో 6,31,117 మంది కూలీలు నమోదు కాగా 2,93,891 మంది కూలీలకు పని కల్పించారు. కాగా కూలీల నమోదులో నల్లగొండ జిల్లా మొదటి స్థానంలో ఉంది. అదేవిధంగా జిల్లాలో 7,854 స్వయం సహాయక సంఘాలకు రూ.408 కోట్ల రుణాలు అందించి 12వ స్థానం దక్కించుకుంది.

'స్వామినాథన్' సిఫారసులు అమలు చేయాలి



ట్రాక్టర్ నడుపుతున్న మల్లు లక్ష్మి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేసి రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి పంటలకు మద్దతు ధర నిర్ణయించే చట్టం తేవాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌ఎంకే) పిలుపులో భాగంగా గురువారం సూర్యాపేటలోని జనగాం క్రాస్ రోడ్డు వద్ద వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రాక్టర్స్ ర్యాలీని ఆమె ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల అన్నిరకాల రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రుణ విమోచన చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొప్పోజు సూర్యనారాయణ, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్రి శ్రీరాములు, మట్టిపల్లి సైదులు, బుద్ధ సత్యనారాయణ, మల్లు నాగార్జునరెడ్డి, బెజవాడ వెంకటేశ్వర్లు, ఏపూరి సోమన్న ఉన్నారు.

జాన్‌పహాడ్ ఉర్సు ప్రారంభం

- ఉల్లాస్‌తో మరూ అయిన ఉత్సవాలు
- బాబాల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- నేడు గంధం ఊరేగింపు
- హాజరుకానున్న మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, ఇతర ప్రముఖులు



దర్గా వద్దకు గంధం, దట్టీలు తీసుకెళ్తున్న ముజావర్, ఉత్సవాల నిర్వాహకులు

పాలకవీడు: మత సామరస్యానికి ప్రతీక అయిన పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా ఉర్సు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. గుసుల్ షరీఫ్ (ఉల్లా)తో తొలి ఘట్టం మొదలైంది. మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు దర్గాలోని సైదులుబాబా సమాధులను శుభ్రంచేసి సూర్యోదయానికి ముందే గంధం, నూతన వస్త్రాలు(దట్టీలు), పూలదండలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన హజ్రత్ సయ్యద్ మొహినుద్దీన్ షహీద్(రహ్మతుల్లా అలైహ్), హజ్రత్ సయ్యద్ జాన్‌పాక్ షహీద్(రహ్మతుల్లా అలైహ్) సమాధులకు గంధం, నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బాబా సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి బాబాకు నైవేద్యం సమర్పించారు. అనంతరం దర్గా సమీపంలోని నాగేంద్రుని పుట్ట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఫక్కీరుల బృందం ఖవ్వాలీ నిర్వహిస్తూ ముస్లిం సంప్రదాయ పద్ధతిలో భజనలు, పాటలు ఆలపించారు. శుక్రవారం నిర్వహించే గంధం ఊరేగింపు సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు రానున్నందున ఇబ్బందులు కలగకుండా ఆరోగ్య, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఎలక్ట్రిసిటీ, ఫైర్, ఆర్టీసీ, పోలీస్ వారు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. సూర్యాపేట, మిర్యాలగూడ, కోదాడ ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.




బాబా సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తున్న మహిళా భక్తులు

నేడు అశ్వంపై గంధం ఊరేగింపు..

ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించే ప్రధాన ఘట్టం గంధం ఊరేగింపు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌అలీ, జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఇతర ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉన్నట్టు దర్గా నిర్వాహకులు తెలిపారు. గంధం ఊరేగింపునకు వేలాదిగా భక్త జనం తరలిరానున్నారు. డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి, హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో 390 మంది పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన పవిత్ర గంధాన్ని దర్గా సమీపంలోని నందల్‌ఖానాలో ఉంచుతారు. శుక్రవారం ఉదయం ప్రత్యేకంగా అలంకరించిన అశ్వంపై జాన్‌పహాడ్ గ్రామంతోపాటు, చెరువుతండా, కల్మేటితండా పుర వీధుల్లో ఊరేగించి తిరిగి ఒంటిగంటకు దర్గా వద్దకు చేర్చుతారు. ఆ సమయంలో పవిత్ర గంధాన్ని తాకేందుకు భక్తుల మధ్య తొక్కిసలాట చోటుచేసుకునే అవకాశం ఉండటంతో పోలీసులు, రోప్ పార్టీల సాయంతో అన్నివైపులా గట్టి నిఘా ఏర్పాటు చేశారు.


పటిష్ట బందోబస్తు కల్పిస్తాం
- ఎస్పీ రాజేంద్ర ప్రసాద్



జాన్‌పహాడ్ దర్గా వద్ద సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

జాన్‌పహాడ్ దర్గా ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం నిర్వహించే గంధం ఊరేగింపునకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉర్సు వద్ద బందోబస్తు నిర్వహణ విషయంపై జాన్‌పహాడ్ దర్గావద్ద గురువారం సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. రాత్రి 7గంటల నుంచి అర్ధరాత్రి 12గంటల వరకు దర్గా ప్రాంతంలోకి అనుమతి లేదన్నారు. ఉర్సుకు వచ్చే వాహనాలను కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోకి మళ్లించాలన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి, నలుగురు సీఐల పర్యవేక్షణలో 400 సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. రోడ్లపై అన్నదానాలు చేపట్టవద్దన్నారు. దర్గా సమీపంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక 'జాన్‌పహాడ్ దర్గా'
- జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక



దర్గా వద్ద జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

జాన్‌పహాడ్ దర్గా ఉర్సు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక అన్నారు. గురువారం ఆమె జాన్‌పహాడ్ దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీపీ, జెడ్పీటీసీల కోరిక మేరకు దర్గా అభివృద్ధికి రూ.10లక్షల నిధులు మంజూరు చేస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా గోపాల్, జెడ్పీటీసీ మాళోతు బుజ్జి మోతీలాల్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ యరగ్ల సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ వెంకటాచారి, ఎంపీటీసీ ఉపేందర్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్పీ కార్యాలయంలో జెండావిష్కరణ



జెండాకు వందనం చేస్తున్న ఎస్పీ

సూర్యాపేట క్రైం : 74వ గణతంత్ర దినోత్సవాన్ని పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేంద్రప్రసాద్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలో..



జెండావిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.గౌతంప్రసాద్

చివ్వెంల : సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.గౌతంప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జ్యుడీషియల్ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి సీనపల్లి సోమేశ్వర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

జెడ్పీ కార్యాలయంలో..



జెడ్పీ కార్యాలయంలో జెండావందనం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక, సీఈఓ

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని జెడ్పీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపిక జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు

జిల్లా వ్యాప్తంగా 74వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తూ ఉత్తమ సేవలందించిన అధికారులకు, సిబ్బందికి కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ ప్రశంసపత్రాలు, అవార్డులు అందజేశారు. అదే విధంగా స్వాతంత్య్ర సమరయోధులను ఘనంగా సన్మానించారు.



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శిరీష; డాక్టర్ శ్రీనివాసరావు, జిల్లా పశువైద్యాధికారి; రమేష్‌కుమార్, డీపీఆర్ఓ; రామారావునాయక్, డీపీఓ; సురేష్, జిల్లా పరిషత్ సీఈఓ; శ్రీదేవి, కలెక్టరేట్ ఏఓ; సుదర్శన్‌రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్; ఆకాశ్‌వర్మ, సీనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్



అయాజుద్దీన్, సీసీ టు లోకల్‌బాడీ అదనపు కలెక్టర్; రంజిత్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్; అబ్దుల్లా, వర్క్ ఇన్‌స్పెక్టర్, కలెక్టరేట్; శ్రీను, సీసీ, రెవెన్యూ అదనపు కలెక్టర్; వెంకటేశ్వర్లు, అటెండర్, కలెక్టరేట్; మొహినుద్దీన్, అటెండర్, కలెక్టరేట్; రఫీక్ అహ్మద్, కలెక్టర్ డ్రైవర్; శ్రీనివాస్‌శర్మ, తహసీల్దార్, కోదాడ; సురేష్‌బాబు, ఏఓ, డీపీఓ సూర్యాపేట; వెంకటేశ్వర్‌రెడ్డి, డీఎస్పీ కోదాడ; నాగభూషణం, డీఎస్పీ సూర్యాపేట; శ్రీనివాస్, ఎస్‌బీ ఎస్‌ఐ, సూర్యాపేట



రాజశేఖర్, సీఐ, సూర్యాపేట; రామలింగారెడ్డి, సీఐ, సూర్యాపేట; విష్ణుమూర్తి, ఎస్‌ఐ, చివ్వెంల; వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐ, హుజూర్‌నగర్; కొండల్‌రెడ్డి, ఎస్‌ఐ, గరిడేపల్లి; రవి, ఎస్‌ఐ, మఠంపల్లి; క్రిష్టయ్య, హెడ్ కానిస్టేబుల్, సూర్యాపేటటౌన్; కరుణాకర్, హెడ్ కానిస్టేబుల్, సూర్యాపేటటౌన్; జహంగీర్, హెడ్ కానిస్టేబుల్, స్పెషల్ బ్రాంచ్; వీరబాబు, జోనల్ సబ్ ఇన్‌స్పెక్టర్, ఇంటెలిజెన్స్; నవీన్, కానిస్టేబుల్, ఇంటెలిజెన్స్ సూర్యాపేట; రమేష్‌నాయక్, ఫైర్ ఆపరేటర్, కోదాడ



నాగేశ్వర్‌రావు, తహసీల్దార్, నడిగూడెం; ఎర్రయ్య, ఎంపీడీఓ, నడిగూడెం; ప్రసాద్ సీనియర్ అసిస్టెంట్, ఎంపీడీఓ, ఆత్మకూర్.ఎస్; శ్రీరాములు, డీఎల్‌పీఓ, కోదాడ; హరిసింగ్, ఎంపీఓ, మోతె; హజీహొద్దీన్, సీనియర్ అసిస్టెంట్, ఐలాండ్‌పేవర్; రత్నం, జూనియర్ అసిస్టెంట్, ఐలాండ్‌పేవర్; సత్యం, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్; సైదులు, రికార్డ్ అసిస్టెంట్, ఐ లాండ్ పేవర్; రజని, జూనియర్ జీపీ సెక్రటరీ, చివ్వెంల; శ్రీనివాసరావు, స్టాటిస్టికల్ ఆఫీసర్; ఉషశ్రీ, ఏఈఓ, మామిళ్లగూడెం



విజయ్, జూనియర్ అసిస్టెంట్, డీఈఓ ఆఫీస్; ప్రియాంక, డీటీ, సివిల్‌సప్లయ్ ఆఫీస్; తబ్రేజ్ అహ్మద్, సీనియర్ అసిస్టెంట్; వెనర్జీ, అసిస్టెంట్ మేనేజర్, సివిల్ సప్లయ్; దీప్‌సింగ్, అకౌంటెంట్, సివిల్ సప్లయ్; షేక్ ఖలీల్, హెడ్ వార్డర్, సబ్ జైల్ సూర్యాపేట; శైలజ, కౌన్సిలర్ సఖీసెంటర్; నాగరాణి, సెకండ్ ఏఎన్ఎం; పద్మమ్మ, హెడ్ నర్స్, జీజీహెచ్ సూర్యాపేట; సుజాత, ప్రొఫెసర్, ప్రభుత్వ మెడికల్ కళాశాల; రవికుమార్, అసిస్టెంట్ సర్జన్, హుజూర్‌నగర్; రుక్సర్ సుల్తానా, ఉర్దూ ఆఫీసర్, మైనార్టీ వెల్ఫేర్



గిరి, డేటా ఎంట్రీ ఆపరేటర్, మైనార్టీ ఆఫీస్; కిషన్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎస్సీ కార్పొరేషన్; శివలింగ ప్రసాద్, డిప్యూటీ స్టాటిస్టికల్; జ్యోతి, హాస్టల్ వార్డెన్, కోదాడ; సైదులు, వాచ్‌మెన్, బీసీ కార్యాలయం; రాములు, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్, సూర్యాపేట; రాధ, జూనియర్ అసిస్టెంట్, ఎస్సీ ఆఫీస్; దుర్గాప్రసాద్, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్, సూర్యాపేట; భవాని, ఇంజనీర్, సూర్యాపేట మున్సిపాలిటీ; వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఎంఆర్ఎం, సెర్ప్; నాగయ్య, ఏపీఓ, చివ్వెంల; సుధీర్‌రెడ్డి, సీఈఓ జాజిరెడ్డిగూడెం

● గణతంత్ర సంబురం





యాదాద్రి కలెక్టరేట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు



నల్లగొండ కలెక్టరేట్‌లో స్వాతంత్య్ర సమరయోధులను సన్మానిస్తున్న జెడ్పీచైర్మన్, ఎమ్మెల్యే



యాదాద్రి కలెక్టరేట్‌లో స్వాతంత్య్ర సమరయోధుడిని సన్మానిసున్న కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



వివిధ శాఖల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, భువనగిరి ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి



సూర్యాపేటలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో గెలుపొందిన ఎస్పీ టీంకు బహుమతి అందజేస్తున్న కలెక్టర్



సూర్యాపేట కలెక్టరేట్‌లో సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శించిన విద్యార్థినులతో కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్



సూర్యాపేట కలెక్టరేట్‌లో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు



పల్లె ప్రగతి స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

కలిసికట్టుగా జోడో అభియాన్ యాత్ర

● డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్

భానుపురి(సూర్యాపేట): కలిసికట్టుగా హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర చేపట్టి ప్రతి ఇంటికీ రాహుల్‌గాంధీ సందేశాన్ని చేరవేస్తామని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ తెలిపారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించి కరపత్రాలు, పోస్టర్ విడుదల చేసి మాట్లాడారు. భద్రతా కారణాలు చూపి జనవరి 26న రాహుల్‌గాంధీ కార్యక్రమాన్ని అడ్డుకున్నారని, జనవరి 30న శ్రీనగర్‌లో జాతీయ జెండా ఎగరేసి తీరుతారన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 3,500 కిలోమీటర్లు భారత్ జోడో యాత్ర చేసిన రాహుల్‌గాంధీ ప్రజాస్వామ్యంపై ప్రజల్లో తిరిగి విశ్వాసం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు, పీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ తండు శ్రీనివాస్ యాదవ్, పీసీసీ ఎస్సీసెల్ వైస్ చైర్మన్ రమేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, రమేష్‌గౌడ్, అంజద్‌అలీ, శ్రీనివాస్, సాగర్‌రెడ్డి, సైదులు ఉన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

మిర్యాలగూడ: భూతగాదాలతో రైతు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన మాడ్గులపల్లి మండలంలోని కల్వలపాలెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వలపాలెం గ్రామానికి చెందిన చింతకాయల సైదులుకు, తన వ్యవసాయ పొలం పక్కన రైతులకు బాట విషయమై వివాదం నడుస్తుంది. దీంతో మనస్తాపానికి గురైన సైదులు గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తమ వ్యవసాయ భూమిలోకి వెళ్లటానికి మూసీ కాల్వ వెంట ఉన్న బాటను పక్కన రైతులు దున్ని సాగు చేస్తున్నారని, ఇదే విషయంపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని సైదులు కుటుంబ సభ్యులు ఆరోపించారు. మిర్యాలగూడ ఆస్పత్రిలో బాధితుడిని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పరామర్శించారు.

తప్పిపోయిన విద్యార్థి మృతదేహం లభ్యం

మునగాల(కోదాడ): మండలంలోని నేలమర్రి గ్రామానికి చెందిన బాషపంగు శ్రీనివాస్ కుమారుడు ప్రణయ్‌కుమార్(18) సోమవారం నుంచి కనిపించకుండాపోయి, గురువారం ఖమ్మం జిల్లా పరిధిలోని పాలేరు రిజర్వాయర్‌లో శవమై తేలాడు. మునగాల ఎస్‌ఐ లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బాషపంగు ప్రణయ్‌కుమార్ ప్రస్తుతం ఐటీఐ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా అతడి మానసికస్థితి సరిగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు గతంలో విజయవాడలోని ఓఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఇదిలా ఉండగా ప్రణయ్‌కుమార్ సోమవారం తన బైక్ తీసుకొని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు రెండు రోజులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే మంగళవారం ప్రణయ్‌కుమార్ బైక్, సెల్‌ఫోన్, చెప్పులు మునగాల శివారులో గల సాగర్ ఎడమ కాలువ ఒడ్డున కనిపించడంతో కాలువలో దూకి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని భావించి న కుటుంబ సభ్యులు కాలువ వెంట వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో గురువారం పాలేరు రిజర్వాయర్ వద్దకు చేరుకో గా రిజర్వాయర్‌లో ప్రణయ్‌కుమార్ మృతదేహం లభించింది. మృతదేహాన్ని రిజర్వాయర్ నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.